నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 RANGAREDDY



సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# తెలంగాణ గొంతుక బీఆర్ఎస్సే

- జాతీయ పార్టీలతో ప్రజలకు ఒరిగేదేమీలేదు
- కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించి ఎండగట్టండి
- కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సబితారెడ్డి

ఆర్కేపురం, ఏప్రిల్ 20 : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో గొంతెత్తి కొట్లాడేది బీఆర్ఎస్సే ఎంపీలేనని, జాతీయ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సరూర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్‌లోని సమస్యలపై కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు పూర్తి అవగాహన ఉందని, ఆయనను గెలిపిస్తే పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతారన్నారు. కాంగ్రెస్ ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కేసీఆర్‌పై పదే పదే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ రాష్ట్రంపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు పదే పదే కేసీఆర్‌ను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి ఏవిధంగా ఆదరణ ఉందో స్పష్టంగా అర్థమవుతున్నదన్నారు. పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ కేసీఆర్ వెన్నంటే ఉన్నటువంటి వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, డివిజన్ అధ్యక్షుడు మహేందర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, నియోజకవర్గ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, సీనియర్ నాయకులు జిల్లెల కృష్ణారెడ్డి, సుశీల, రిషి తదితరులు ఉన్నారు.

# నేటి 'వివాహప్రాప్తి' రద్దు


గరుడ ప్రసాదం రద్దీ నేపథ్యంలో నిర్ణయం

యథావిధిగా స్వామివారి కల్యాణం

చిలుకూరు ఆలయ అర్చకులు రంగరాజన్



మొయినాబాద్, ఏప్రిల్ 20 : చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు రంగరాజన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన శ్రీవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంతానం లేని వారికి గరుడ ప్రసాదం వితరణ చేశామని, భక్తులకు స్వామి వారి దివ్య ఆశీస్సుల ప్రాప్తి కలుగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. వివాహం కానివారికి కల్యాణ మహోత్సవంలో పాల్గొంటే వివాహ ప్రాప్తి కలుగుతుందని ప్రకటించడం జరిగింది. కానీ సంతాన ప్రాప్తి కోసం వచ్చిన భక్తులను దృష్టిలో పెట్టుకునే అదే రీతిలో భక్తులు పాల్గొంటే చాలా ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉన్నది. దీన్ని దృష్టిలో పెట్టుకుని వివాహ ప్రాప్తి కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. రేపు సాయంత్రం జరుగబోయే కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని, వివాహం కాని వారు ఇంటి వద్దనే ఉండి చిలుకూరు బాలాజీని స్మరించుకోవాలని సూచించారు.





ఎంపీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బషీరాబాద్ గ్రామ వాసి (ఫైల్)



ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి చుక్కెదురు

మొన్న వికారాబాద్, నిన్న తాండూరులో కడిగిపారేసిన జనం

ప్రసాద్‌కుమార్ ఓటమిని కోరుకున్న రంజిత్‌రెడ్డి కోసం పనిచేయబోమంటున్న కాంగ్రెస్ నేతలు

అయోమయంలో రంజిత్‌రెడ్డి.. వెంటాడుతున్న ఓటమి భయం

# చేతికి చిక్కులే

వికారాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని ఓటమి భయం వెంటాడుతున్నది. రంజిత్‌రెడ్డి ప్రచారంలో భాగంగా ఎక్కడికెళ్లినా ప్రజల నుంచి నిరసనలు, నిలదీతలే ఎదురవుతున్నాయి. సొంత పార్టీ నేతల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో ఆయన అయోమయంలో పడిపోయారు. ఎంపీని చేసి గుర్తింపు తెచ్చిన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన రంజిత్‌రెడ్డికి జనం చుక్కలు చూపిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అర్బన్ ప్రాంతంలో కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉండడంతో గ్రామీణ ప్రాంతంపై దృష్టి సారించారు. ఇక్కడ కూడా సొంత పార్టీ నాయకులు బాహాటంగానే నిరసన వ్యక్తం చేస్తూ రంజిత్‌రెడ్డికి చెమటలు పట్టిస్తున్నారు. తన మనుషులతో చేపించుకుంటున్న సర్వేల్లో తానే గెలుస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్న రంజిత్‌రెడ్డి అండ్ టీంకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న నిరసనలు మింగుడుపడడం లేదు. ఎంపీగా ఉండి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి నయా పైసా పనిచేయని రంజిత్‌రెడ్డిపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కేవలం డబ్బును నమ్ముకొని రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థికి సొంత పార్టీ నేతలే పార్లమెంట్ ఎన్నికల్లో చేయి ఇవ్వనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలుపునకు పనిచేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి మూడు నెలలకే కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం ప్రజలు జీర్ణించుకోవడం లేదు.

## అడుగడుగునా నిలదీతలే..

రంజిత్ రెడ్డికి ఇటు ప్రజల నుంచి, అటు సొంత క్యాడర్ నుంచి చేదు అనుభవం తప్పడం లేదు. ఏ నియోజకవర్గానికెళ్లినా అడుగడుగునా నిలదీతలే ఎదురవుతున్నాయి. మొన్న వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జరిగిన చేదు అనుభవం మరవక ముందే.. నిన్న తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలో చుక్కెదురైంది. అనామకుడిని ఎంపీగా చేస్తే బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ప్రచారానికి రావడంపై సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు గట్టిగా నిలదీశారు. 'ఎంపీగా ఉండి ఏం చేశావ్, బషీరాబాద్‌లో ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు ఆపించలేకపోయావ్.. మాట్లాడేందుకు వస్తే కూడా పట్టించుకోలేదు.. డౌన్ డౌన్ రంజిత్ రెడ్డి' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బషీరాబాద్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని 25 రోజులు దీక్ష చేస్తే ఎంపీగా ఉన్న రంజిత్‌రెడ్డి పట్టించుకోకుండా స్థానికుల గొంతు నొక్కేందుకు ప్రయత్నించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంజిత్‌రెడ్డి లాంటి నాయకులకు ఓటేసి గెలిపిస్తే ప్రతిరోజూ మనకు అవమానమే అంటూ బషీరాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా మీరు ఎట్లా గెలుస్తారో మేం చూస్తామని రంజిత్‌రెడ్డిని ఉద్దేశించి సొంత పార్టీ నాయకులే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇటీవల వికారాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలోనూ రంజిత్‌రెడ్డికి చేదు అనుభవం తప్పలేదు. 'ప్రసాద్‌కుమార్‌ను ఓడించేందుకు పనిచేసిన మీ గెలుపు కోసం మేం పనిచేయలేమని, మాపై కేసులు పెట్టి మమ్మల్ని ఇబ్బందిపెట్టింది ఇంకా మరువలేదని, రంజిత్‌రెడ్డి కోసం పనిచేయడం మా వల్లకాదంటూ' కాంగ్రెస్ నాయకుడు, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముందే తెగేసి చెప్పడం గమనార్హం. ఒకరిద్దరూ నాయకులు అయితే అసభ్యపదజాలంతో మాట్లాడినట్లు జిల్లా అంతటా జోరుగా ప్రచారం జరుగుతున్నది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇంటింటికెళ్లి పనిచేయాలంటూ రంజిత్‌రెడ్డి బతిమిలాడి ప్యాకేజీలిచ్చినా కాంగ్రెస్ నాయకులు మాత్రం పైకి మీ గెలుపు కోసం పనిచేస్తామని చెబుతున్నా...లోలోపల మాత్రం రంజిత్ రెడ్డికి వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. రంజిత్ రెడ్డిని వేరే పార్టీలు కాదు సొంత పార్టీ నేతలే ఓడించడం ఖాయమనే గుసగుసలు వినిపిస్తున్నాయి.



పింఛన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు (ఫైల్)

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలి

– ఎస్పీ కోటి రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 20 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ లొకేషన్స్, రూట్స్, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెక్‌పోస్టుల్లో తనిఖీలు మరింత పటిష్టం చేయాలన్నారు. మద్యం, డబ్బులు, ఓటర్లకు ప్రలోభాలకు గురిచేసేయకుండా వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. రౌడీషీటర్లను బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల బందోబస్తుకోసం జిల్లాకు వచ్చే కేంద్ర బలగాలతో సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పెండింగ్ కేసులను వెంటనే పూర్తిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, కరుణాసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఆమనగల్లులో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం

# ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్రాభివృద్ధి



ఆమనగల్లులో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 20 : ప్రాంతీయ పార్టీలతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆమనగల్లులో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు ఎకరాకు ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు అందించలేకపోయారన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. సీఎం పిట్టల దొరలా పూటకోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆగస్టు 15వరకు రుణమాఫీ చేస్తానంటూ మరోసారి రైతులను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి పట్టిన గతే నీకూ పడుతుందని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు , రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. గతంలో పనిచేసిన ప్రధానమంత్రులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి దేశానికి సంబంధించిన సమాచారం చెప్పేవారన్నారు. ప్రస్తుత ప్రధాని మోదీ 10 ఏండ్లుగా ఒక్క మీడియా సమావేశం కూడా పెట్టలేదన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు తన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు బీజేపీ ఎంపీ సీటు ఇవ్వడంతో పార్టీ మారారని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఉన్న పదవిని వదులుకుని రాజకీయాలకు వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కావాలో.. పరిజ్ఞానం లేని భరత్‌ప్రసాద్ కావాలో ప్రజలు ఆలోచించుకొని ఓటు వేయాలని అన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## ఆశీర్వదించండి.. అండగా ఉంటా : ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంత బిడ్డగా మీ ముందుకు వచ్చానని తనకు ఓటువేసి ఆశీర్వదిస్తే అండగా ఉంటానన్నారు. గురుకుల పాఠశాలల కార్యదర్శిగా ఎంతో మంది పేద విద్యార్థుల అభివృద్ధికి బాటలు వేశానన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరితే టీఎస్‌పీఎస్సీ పదవి ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి పిలిచారన్నారు. తాను ప్యాకేజీలకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకెళ్తున్నానని, కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీ అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాశ్‌రావు, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యానాయక్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జడ్పీటీసీలు నేనావత్ అనురాధ, దశరథ్‌నాయక్, విజితారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, వైస్ ఎంపీపీలు ఆనంద్, శంకర్, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్ఎన్ రెడ్డి, ఎంపీటీసీలు కుమార్, గ్యార వెంకటయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పొనుగోటి అర్జున్‌రావు, ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి, శంకర్, విజయ్‌గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగు వీరయ్య, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, బండగల్ల చందు, నాయకులు సురమల్ల సుభాశ్, జంతుక అల్లాజీ, కొమ్ము ప్రసాద్, డేరంగుల వెంకటేశ్, చలిచీమల సతీశ్, రమేశ్‌నాయక్, భాస్కర్, పోలే మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

